# వాస్తవికతకి వన్నెచిన్నెలు

( స్కెచ్ )

యం. జానకీరాణి

హైదరాబాదులో రాత్రి తొమ్మిదిన్నరకి ఒంటరిగా రిక్షాలో ఇంటికి వస్తున్నాను. బయల్దేరే వేళకి గుడ్డివెన్నెల కాస్తోంది. చంద్రుడుమాయమై మబ్బులు దట్టమైనాయి. ఇంతలోనే సన్నగా ప్రారంభమైన జల్లువాన పెద్దదైంది. ధారాపాతంగా పడుతోంది వర్షం. రోడ్డు గతుకులు గతుకులుగా వుంది. మామూలుగా ఎత్తుపల్లాలు వుండే రోడ్డు-పైకి ఎక్కవలసివస్తోంది. రిక్షావాడు నడిచి, రిక్షాను తోసుకుపోతున్నాడు. ఎదురు ఎత్తుగా కనుపిస్తోంది రోడ్డు. గాలి వెనక్కి త్రోసివేస్తోంది. ఒక పెద్దచెట్టుకింద ఆపమని ఆదేశించాను రిక్షావాడి అవస్థ చూడలేక.

నీలం దీపాలవెలుగులో మెరుస్తూ పడే వానని చూస్తూ, నెత్తిమీది మర్రి ఆకుల గలగలని వింటూ కూర్చున్నాను. మనస్సు మౌనంగా వుంది. రిక్షావాలా వానకోటు, పైన టోపీ సరిచేసుకుని చెట్టు మొదట్లో కూర్చున్నాడు.

సిమెంటురోడ్డు విశాలంగా, నిర్మానుష్యంగా వుంది. ప్రక్కనే ఒక చిన్న సందు. సందులో అడుగుల చప్పుడు దూరంగా వినిపించి, దగ్గరైంది. ఒక కుర్రవాడు రిక్షావద్దకు పరుగెత్తుకుని వచ్చాడు. ఆయాసపడుతున్నాడు. చుట్టూ కలయచూసి చెట్టు క్రింద రిక్షావాడివద్దకు వెళ్ళాడు.

"ఏయ్ రిక్షా, వస్తావా?" ఆయాసపడుతూ, ఒగరుస్తూ అడిగాడు.

"మనుష్యులున్నారు బాబూ" అన్నాడు రిక్షావాడు ఆ కుర్రవాడు 'అరె' అనుకుంటూ సిమెంటు రోడ్డుమీదే ముందుకు పరుగెత్తసాగాడు.

పాపం, ఏం అవసరమొచ్చిందో. నా మనస్సు పరిపరివిధాలా పోయింది. ఏదో ఆపద, అవసరం రానిదీ ఈ కుర్రాడింతగా ఆదుర్దాపడడు ఏమొచ్చి వుంటుంది? బహుశా... పాపం ఏ స్త్రీ ఐనా నొప్పులుపడుతుందేమో. అయివుంటుంది. లేకపోతే ఇంత కాళరాత్రివేళ ఎవరికేమి అవస్థలువస్తాయి అల్లాంటివి తప్ప...

పెంకుటిల్లు, ఒక వసారా, చిన్నగది. గదిలో మంచంమీద ఒక స్త్రీ పడుకునుంది. విపరీతంగా మూలుగుతోందామె. ఆమె భర్త వసారాలో పచార్లు చేస్తున్నాడు. అతనికి మాత్రం ఆదుర్దా కాదూ పాపం! గదిలో గుడ్డిదీపం వెలుగుతోంది. ఒక ముసలమ్మ కూర్చుని ఏం చేయడానికీ తోచక చూస్తోంది. ఆ స్త్రీ కొడుకు పన్నెండేళ్లవాడు— అర్థంలేని గాభరా పడుతున్నాడు తండ్రివంక చూస్తో. వసారాలో పచార్లు తండ్రి కొడుకువంక హఠాత్తుగా తిరిగాడు.

"ఒరేయి, ఫో. ఒక రిక్షా తీసుకునిరా. అమ్మని ఆస్పటల్‌కి తీసుకువెళ్ళాలి"...

కుర్రవాడు—ఇందాక రిక్షాకోసం వచ్చినవాడు— ఒక్కవురకలో రోడ్డుమీదికి వచ్చేశాడు. లోపల్నుంచి ముసలిబామ్మ అరుస్తోంది

"ఒరేయి రిక్షా ఎల్లాగురా! బండో, కారో కావాలి" అని. వినిపించుకోలేదు కుర్రవాడు. పరుగెత్తుకుని వచ్చాడు. సందు మలుపు తిరిగి సిమెంటురోడ్డు ఎక్కాడు.

నేను దిగి రిక్షా పంపివేస్తే బాగుండేది. సంతోషించేవాడు కుర్రవాడు. పాపమేంచేస్తాడో ఈ కుర్రవాడు! రోడ్డుమీద యిన్నికార్లు పరుగెత్తుతున్నాయి. ఒక్క కారులో దయాత్ములుండరూ ఈ పిల్లాడికి సాయంచేసేవాళ్లు? ఉంటారు.

నా మనస్సు ఇంకా పనిచేస్తోంది... బామ్మ మాటలు వినిపించి వుంటాయి కుర్రవాడికి. అవసరం వాడికిమాత్రం తెలీదూ? రోడ్డుమీదపోయే కారుని ఆపుతాడు. టాక్సీకోసం పోవాలని తెలియదు వాడికి. ఎదురుగా, అడ్డంగా నిలబడుతాడు. కారు ఆగుతుంది బ్రేకువేసి. కారులో బంగారువుంగరాలు, సిల్కుసూటు, గోల్డుఫ్లేకు సిగరెట్లు—పెద్దమనిషి.

"అయ్యా, మా అమ్మకి నొప్పులు వస్తున్నాయండి, హాస్పిటలుకు తీసుకుపోవాలండి. మీ కారు ఒక్కమాటు-లేకపోతే మా అమ్మ చచ్చిపోతుం

దండి" వానలో తడుస్తూ, దీనంగా చూసే ఆ కుర్రవాణ్ణి చూస్తే ఆ పెద్దమనిషి మాత్రం కాదనగలడా? అతను మాత్రం మానవుడు కాదూ? ఒక్కక్షణం తటపటాయించి కారు తలుపు తీస్తాడు. "ఎక్కు." కారు వెనక్కితిరిగి, కుర్రవాడు పరుగెత్తుకొచ్చిన సందుమలుపు తిరుగుతుంది...

ఏమాలోచనలివన్నీ? ఒక స్త్రీ ప్రసవిస్తూంటే ఎవరైనా పురుషుడు, పెద్దవాడు వస్తాడు కానీ, జ్ఞానంలేని ఈ కుర్రవాడిని పంపిస్తారా? అసందర్భం! ఏమిటీ పిచ్చిపిచ్చి ఆలోచనలు అర్థంలేదు.

కానీ—ఏమీ అవసరంలేకుండా ఈ కుర్రవాడిల్లా ఎందుకు పరుగెత్తుకుని వస్తాడు? వెన్నెల్లాగా మెరుస్తున్న నీలం దీపాలకాంతి వంక చూశాను. ఏదోలీలగా, ఒక చక్కని యువతి నా కళ్ళముందు మెదులుతోంది.

ఒక బంగళాలో చక్కని రూం. బీరువాల్లో పుస్తకాలు, చిన్న టేబిలు, కుర్చీ, ఒక మంచం. టేబిలుమీద అగరువత్తులు పొగలు చిత్రవిచిత్రాలుగా పైకిలేచి గాలిలో లీనమౌతున్నాయి. రెండే రెండు చక్కని గులాబీలు టేబిలు మీద సౌరభం వెదజల్లటం లేదుకానీ, అందంగా, మురిపెంగా వున్నాయి. ఒక యువతి మంచంమీద కూర్చుని వుంది. ఎదురుగా అద్దంలో చూసుకుంటూ ఆమె తన జుట్టుని, పమిటని సరిచేసుకుంటోంది. ఇంతలోనే చక్కగా వెళ్ళి చెప్పులు వేసుకుంది. వెనక్కితిరిగి జడను ఒక మాటు చూసుకుంది. ఆ గులాబీ పూలని సున్నితంగా చేతుల్లోవుంచి, డ్రాయరులోంచి దారంతీసి రెండింటినీ కలిపికట్టింది., తల్లో పెట్టుకోవాలని వెనక్కి చేతులు పోనిచ్చింది. కానీ ఏమైందో తీసివేసింది. అద్దంలో ముఖం చూసుకుని సిగ్గుపడుతూ, చిరునవ్వు నవ్వుకుంది. మెరుస్తున్న తన చెక్కిళ్ళని, అనవసరంగా చేతి రుమాలుతో అద్దుకుంది.

నాకర్థమౌతుంది ఇదంతా ఏమిటో ఈ మత్తెక్కించే వాసన, ఆ యువతి ముఖంమీది అర్థంలేని చిరునవ్వులు అన్నీ ఒక త్రుటిలో గ్రహించేశాను. ఆమె ఎక్కడికో వెడుతుంది. బహుశః తన భర్తని... ప్రియుణ్ణి కలుసుకోవడానికి. అతనిక్కడికి తీసుకువస్తుంది. ఒకవేళ స్టేషన్‌కి వెళ్ళి అతనికి స్వాగతమిస్తుంది. ఔను ఇప్పుడే కాబోలు బొంబే మెయిల్ వచ్చేది. అతడొచ్చి ఆ గులాబీలని ఆమె తల్లో తురుమాలి. అదే ఆమె అభిమతం ఐవుంటుంది. లేకపోతే ఎందుకు సందేహిస్తుంది పూలు పెట్టుకోవడానికి? అతను తన ముఖం చూస్తూ, ఆ గులాబీలని తన ముఖానికి పోలుస్తూ, హాస్యాలాడుతుంటేలాలనగా అతను పూలు తురుముతుంటే ఇవన్నీ వూహించుకునే ఆ యువతిముఖంమీది చిరునవ్వులు.

ఇంతలోనే ఉలిక్కిపడి రిస్టువాచీ వంక చూసింది. చకచక వరండాలోకి వచ్చింది. "రామూ!" కుర్రవాడు వచ్చాడు. "పన్నెండేళ్ళ కుర్రవాడు—రిక్షాకోసం పరుగెత్తుకొచ్చిన కుర్రవాడు వచ్చాడు.

"స్టేషన్‌కి పోవాలి. అర్జంటుగా రిక్షా తీసుకురా" బైటికి పరుగెత్తుకువచ్చాడు కుర్రవాడు సందుమలుపు తిరిగి, సిమెంటు రోడ్డుమీదకి వచ్చాడు. నేను వున్నాను రిక్షాలో నేనుదిగి రిక్షా ఇచ్చివేస్తే-కానీ ఎందుకివ్వాలి? ఒకయువతి తన ప్రియుణ్ణి గురించి పడే తాపత్రయంలో నాకేమిటి అనుకంప? కుర్రవాడు పాపం—యజమానురాలు కేకలేస్తుందని వానలోనే పరుగెత్తుతున్నాడు. ఏంచేస్తాడు?

ఏమిటిల్లా పిచ్చిపిచ్చిగా పోతోంది మనస్సు అనుకున్నాను. ఐనా ఎందుకొచ్చిన పనికిమాలిన ఆలోచనలివన్నీ వూసుపోక అనుకున్నాను. వాన తగ్గింది. రిక్షావాడు లేచివచ్చి, రిక్షా నడిపించసాగాడు. చల్లనిగాలి ప్రారంభమైంది.

నాలుగైదు గజాల దూరంలో లైటుక్రింద ఆ కుర్రవాడు రిక్షాతో బేరమాడుతున్నాడు. నాకు కుతూహలం కలిగింది అతను ఎక్కడికి బేరమాడుతున్నాడో వినాలని. రిక్షా నడుస్తోంది కాబట్టి వినవచ్చు. బైటికివంగి తొంగిచూశాను. ఆ కుర్రాడే వానలో తడిసి ముద్దయినాడు. "ఇదుగో రిక్షా, లిబర్టీ టాకీసుకు ఏమిమ్మంటావు?" అంటున్న ఆ పసికంఠం వినిపించింది. హరి భగవంతుడా! గడియారంవంక చూశాను. 9—45! రెండో ఆటకి టైమైంది. అప్పుడప్పుడు తలపులు తప్పటడుగులేస్తుంటాయని, నన్ను నేనే సమాధాన పరచుకున్నాను. రిక్షావాడు రిక్షా ఎక్కాడు. హాయి వేగంతో నేనూ, నా రిక్షా తేలిగ్గా జారిపోతున్నాం రోడ్డుమీద.

★